క్లుప్తంగా

ప్రభుత్వ బడుల్లో సాంకేతిక విద్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని పులుమామిడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం డిజిటల్ గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు బెల్టు, టైలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం బడుల్లో నాణ్యమైన డిజిటల్ విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం ప్రభుత్వం ఇటీవల కాస్మోటిక్, మెనూ చార్జీలను పెంచిందని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఎంఈఓ అబ్దుల్‌రెహమాన్, నాయకులు వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం



కుల్కచర్ల: చెక్కు అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్ అన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యల కారణంగా ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం ఆర్థికంగా సహకారాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపాల్‌నాయక్, రమేష్, శంకర్ నాయక్, వెంకటయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పూడూరు: అనారోగ్యాల బారిన పడి ఆస్పత్రుల్లో చికిత్సలు చేసుకున్న వారు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మన్నెగూడ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, బాలమణి, విష్ణువర్ధన్‌రెడ్డి, రహీంఖాన్, సుభాస్, గోవర్ధన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి సేవలో ఎమ్మెల్యే



అయ్యప్ప స్వామి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: పెద్దేముల్ మండల కేంద్రంలోని శంబులింగేశ్వరస్వామి దేవాలయంలో అయ్యప్ప నామస్మరణలతో మార్మోగింది. గురువారం పెద్దేముల్‌కు చెందిన పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభ స్థాపన



ఆలయం కోసం ధ్వజ స్తంభం స్థాపించిన స్వాములు

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని కరీంపూర్ గేటు సమీపంలో అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణం కోసం స్వాములు గురువారం భూమి పూజ చేసి ధ్వజ స్తంభం స్థాపించారు. అందరి సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో రవిగౌడ్ గురుస్వామి, స్వాములు మహేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, బల్వంత్, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

సర్పంచ్ ఆశలపై నీళ్లు!

- మోమిన్‌పేట మున్సిపాలిటీ కానుండటంతో నిరాశలో నేతలు
- ఇన్నేళ్లు కష్టపడింది వృథా అయిందని గగ్గోలు



ఎన్కేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

మోమిన్‌పేట: ఎన్నో ఏళ్లుగా సర్పంచ్ పదవిపై ఆశలు పెట్టుకున్న నాయకగణానికి భంగపాటు తప్పలేదు. మోమిన్‌పేటతో పాటు మరో ఎనిమిది గ్రామాలను కలుపుతూ మున్సిపాలిటీ కేంద్రంగా ఏర్పాటు కానుండటంతో ఆశావహులకు నిరాశే మిలిగింది. ఏడాది కాలంగా గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే వారి ఆశలపై నీళ్ల చల్లినట్టయింది. మోమిన్‌పేటతో పాటు చంద్రాయన్‌పల్లి, రావులపల్లి, బూర్గుపల్లి, కాస్లబాదు, గోవిందాపూర్, మల్లారెడ్డిగూడెం, మొరంగపల్లి, ఎన్కేపల్లి గ్రామాలను కలుపుతూ ప్రభుత్వం మున్సిపాలిటీ ఏర్పాటుకు సన్నాహాలు ముమ్మరం చేసింది. ప్రతి గ్రామం నుంచి జనాభా, ఓటర్లు, భూములు, సర్వే నంబర్లు, ఇళ్లు, పన్నులు తదితర వాటి పూర్తి వివరాలను ప్రభుత్వం తీసుకొంది. అధికారులు ఈ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఒక్కసారిగా నిస్పృహలో నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని ఇది వరకే ప్రకటించడంతో గ్రామాలలో సర్పంచులకు పోటీ చేసే నాయకులు దూకుడు పెంచారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు రిజర్వేషన్‌లను బట్టి ముందుకు సాగేందుకు ప్రణాళికలు వేసుకొన్నారు. సామాజిక వర్గాల వారీగా సమీకరణాలు కూడగట్టుకొని కసరత్తులు చేస్తున్నారు. ఆర్థిక వనరులు సమకూర్చుకుంటున్నారు. ప్రతి ఒక్కరితో కలిసి మాట మాంతి పెంచుకొంటూ కలివిడిగా ఉంటున్నారు. కానీ ఇటీవల మున్సిపాలిటీ అనే పిడుగుతో ప్రస్తుతం నాయకులు తల్లడిల్లుతున్నారు. 9 గ్రామాలలో సర్పంచులుగా పోటీ చేసేందుకు సిద్ధపడిన వారందరూ నిస్పృహకు లోనవుతున్నారు. మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా పోటీ చేయాలంటే పార్టీ టికెట్లు అవసరమని పలువురు అంటున్నారు. 10 నెలలుగా ఎన్నో ఆశలు పెట్టుకొన్నామని ప్రభుత్వం మున్సిపాలిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండటం మింగుడు పడటం లేదని బాహాటంగానే అంటున్నారు. సర్పంచుల ఎన్నికలు ఎప్పుడైనా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. రిజర్వేషన్‌లను ప్రభుత్వం ప్రకటించడమే తరువాయి.. మండల పరిధిలోని మిగిలిన 20 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు నిర్వహించనున్నారు.

నూర్పిడి యంత్రంలో పడి మహిళ దుర్మరణం

- చీర కొంగు మిషన్‌లో చుట్టుకోవడంతో ప్రమాదం
- రెండు భాగాలుగా తెగిపోయిన శరీరం
- హకీంపేటలో ఘటన



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



హేమలత(ఫైల్)

దుద్యాల్: కందుల నూర్పిడి యంత్రంలో పడి ఓ మహిళా కూలీ మృతిచెందిన ఘటన దుద్యాల్ మండలం హకీంపేట్‌లో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి హేమలత (25)కూలీ పనులు చేస్తుకుంటూ కుటుంబానికి చేదోడుగా ఉంటోంది. రోజూ మాదిరిగానే గురువారం దొరమోని వెంకటయ్య అనే రైతు పొలంలో కోసిన కంది పంటను నూర్పిడి యంత్రంలో వేసేందుకు వెళ్లింది. తోటి కూలీలతో కలిసి మిషన్‌లో కంది కొమ్మలు వేస్తున్న హేమలత.. యంత్రం రాడ్డు పైనుంచి దాటి వెళ్లేందుకు ప్రయత్నించింది. ఈసమయంలో తిరుగుతున్న మిషన్ రాడ్డుకు చీర కొంగు చుట్టుకోవడంతో హేమలత నడుము భాగం వరకు మిషన్‌లోకి వెళ్లిపోయింది. శరీరం రెండుభాగాలుగా తెగిపోవడంతో.. తోటి కూలీలందరూ ఒక్కసారిగా భయకంపితులయ్యారు. ఊహించని ఈ ఘటనతో అంతా షాక్‌కు గురయ్యారు. మృతురాలికి భర్త జనార్దన్‌తో పాటు ఓ కూతురు, కొడుకు ఉన్నారు. హేమలత మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



ధారూరు: ఎంఈఓతో కలిసి పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన తహసీల్దార్

దోమ: విద్యావ్యవస్థ ఉన్నతిలో ఉపాధ్యాయ సంఘాల పాత్ర ఎంతో కీలకమైనదని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో ఆయన ఎస్టీయూ టీఎస్ సంఘ నాయకులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రోపాధ్యాయ సంఘం గత 78 ఏళ్లుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో సంఘం కృషి అభినందనీయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.షఫీ, నాయకులు బసిరెడ్డి, శ్రీనివాసరావు, దయాకర్, కనకాచారి, ఇలియాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

తాండూరు రూరల్: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కర్ణాటక–తెలంగాణ సరిహద్దులో ఉన్న తాండూరు నియోజకవర్గంలో విద్యావ్యవస్థను మెరుగుపర్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నేతలు వినోద్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, రాంనర్సింహారెడ్డి, మృత్యుంజయస్వామి, వైద్యనాథ్, నాగప్ప, బాబ్యానాయక్, శ్రీనివాస్, రాములు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..

ధారూరు: పీఆర్‌టీయూ ధారూరు మండల శాఖ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం తహసీల్దార్ సాజిదాబేగం ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి క్యాలెండర్ విడుదల చేసి, సంఘం నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నేతలు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, మాణిక్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హరిలాల్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అనిల్ కుమార్, కాంప్లెక్స్ హెచ్‌ఎం రవీందర్‌గౌడ్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దేముల్‌లో..

తాండూరు రూరల్: పెద్దేముల్ మండల పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ వెంకట్‌ప్రసాద్, ఎంఈఓ నర్సింగ్‌రావులు ఆవిష్కరించారు. గురువారం పెద్దేముల్ మండల ఎమ్మార్సీ కార్యాలయం వద్ద పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నవీన్‌కుమార్, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, రవికాంత్ రెడ్డి, శంకర్, శ్రీనివాస్, బందెప్ప, అహ్మద్, రమణారావు పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల: పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆవిష్కరించారు. యూనియన్ యాలాల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్టారెడ్డి, రాములు ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మొగులయ్య, మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమేష్, వెంకటయ్య, గులాబ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

బంట్వారం: అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన బంట్వారం మండలంలోని బస్వాపూర్‌లో ఎస్‌డీఎఫ్ నిధులు కింద రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు నర్సింలు, యాదగిరి, పార్టీ నాయకులు మోహన్‌రెడ్డి, కృష్ణ, మధుసుదన్‌రెడ్డి, సతీష్, ఆనందం, బిచ్చయ్య, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం’



మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

బంట్వారం: బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం ఖాయమని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ ఆయన్ని వికారాబాద్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పలు అంశాలపై పార్టీ నాయకులతో చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, కొండల్‌రెడ్డి, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపులో ‘సీసీ’లు కీలకం



పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

పూడూరు: పోలీసులు ప్రజలతో సత్సంబంధాలతో మెలగాలని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా గ్రామంలో యువజన సంఘాలను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. నేరాల అదుపు, కేసుల పురోగతిలో సీసీ కెమెరాలు ఎంతో కీలకంగా పని చేస్తాయని అన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం కూల్చివేత

అనుమతులు లేకుండా చేశారని నస్కల్ గ్రామస్తుల ఆరోపణ



జేసీబీతో కూల్చి వేస్తున్న నస్కల్ పాత గ్రామ పంచాయతీ భవనం

పరిగి: ఎలాంటి అనుమతులు లేకుండా పాత గ్రామ పంచాయతీ భవనాన్ని కూల్చడం స్థానికంగా కలకలం రేపింది. మండల పరిధిలోని నస్కల్ పాత గ్రామ పంచాయతీ భవనం శిథిలావసకు చేరుకుంది. దీంతో గురువారం పంచాయతీ కార్యదర్శి, అధికార పార్టీ నాయకులు కొంత మంది కలిసి జేసీబీ సాయంతో కూల్చేశారు. అనుమతులు లేకుండా ఎలా కూల్చేస్తారని కొంతమంది ప్రశ్నించారు. దీంతో అక్కడే ఉన్న అధికార పార్టీకి చెందిన నాయకులు.. మా ప్రభుత్వంలో మేం ఏమైనా చేసుకుంటాం అని బదులిచ్చారు. చేసేదేమి లేక కొంత మంది స్థానికులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఫారుక్ హుస్సేన్‌ని వివరణ కోరగా తీర్మానం చేసి కూల్చేస్తున్నామని తెలిపారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంపై హర్షం

బొంరాస్‌పేట: దేశంలో మొట్ట మొదటి ఉపాధ్యాయినిగా పేరుగాంచిన సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించడం పట్ల మండల మహిళా ఉపాధ్యాయులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. సావిత్రిబాయి జయంతి జనవరి 3ను ‘మహిళా ఉపాధ్యాయ దినం’గా ప్రభుత్వం ప్రకటించడం హర్షనీయమన్నారు. ఇందులో పీఆర్‌టీయూ మండల మహిళా కార్యదర్శి విజయలక్ష్మి, టీవీవీ రాష్ట్ర మహిళా కార్యదర్శి లక్ష్మి, శ్రీప్రియ, పరమేశ్వరి, ఉమాదేవి, ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

షాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో 206 బూత్ అధ్యక్షుడిగా శ్రీనును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీకి యువతే కీలకమని, యువకులందరూ ఏకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ బలోపేతం లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పార్టీని గ్రామ స్థాయిలోనూ మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, గురుస్వామి, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

సేవాలాల్ జీవిత చరిత్రను కాపాడుకోవాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్



నాటక ప్రదర్శనలో పాల్గొన్న రాంబాల్‌నాయక్

కేశంపేట: సంత్ శ్రీ సేవాలాల్ జీవిత చరిత్రను కాపాడి ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని పోల్కోనిగుట్టతండా గ్రామంలో కళాకారులు సేవాలాల్ జీవిత చరిత్రను నాటక రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాంబాల్‌నాయక్ పాల్గొని నాటికను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సేవాలాల్ నాటక ప్రదర్శన ద్వారా లిపి లేని లంబాడీల చరిత్రను ప్రజలకు వివరించే అవకాశం ఉందన్నారు. బంజారా సమాజం ఆచారాలు, వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాల గూర్చి నాటిక ద్వారా వివరించారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షులు రాజునాయక్, లక్ష్మణ్‌నాయక్, జగన్‌నాయక్, పుట్యానాయక్, శంకర్‌నాయక్, రమేశ్‌నాయక్, భాస్కర్‌నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘పీఎం కిసాన్’ పెంపుపై హర్షం

చేవెళ్ల: దేశంలోని రైతుల సంక్షేమం కోసం పనిచేసే ప్రధాని మోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని పెంచినందుకు ఎంతో సంతోషంగా ఉందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ముందు చూపుతో రైతుల కోసం నూతన సంవత్సరంలో సంతోషాన్ని ఇచ్చే విధంగా పీఎం కిసాన్‌ను 6వేల నుంచి 10వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారన్నారు. ఇది నిజంగా రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులకు ఇది వర్తిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న రామస్వామి, నాయకులు

చేవెళ్ల: గ్రామ గ్రామాన సీపీఐ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండలంలోని పలుగుట్ట గ్రామంలో గురువారం పార్టీ వంద వసంతాల ఉత్సవాల్లో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పార్టీని గ్రామాల్లో మరింత బలోపేతం చేయాలన్నారు. దేశంలోనే వంద ఏళ్ల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అన్నారు. కార్మికులు, కర్షకుల పక్షాన నిలబడి నిరంతరం పోరాటాలు చేస్తూ వారికి న్యాయం చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదును పెద్దఎత్తున చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణ, సత్తిరెడ్డి, శ్రీనివాస్, సుధీర్, అంజయ్య, బాబురావు, యాదగిరి, మంజుల, మీనాక్షి, కళావతి, పద్మ, రఘు, సత్తయ్య, యాదమ్మ తదితరులు ఉన్నారు.

కానరాని నిబంధనలు!



టార్పాలిన్ లేకుండానే జాతీయ రహదారి మీదుగా డస్ట్ తరలిస్తున్న టిప్పర్

ఓవర్‌లోడ్ టిప్పర్లతో ప్రమాదాలు

- వెనుక వచ్చే వారిపై కంకర, దుమ్ము
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: భారీ వాహనాలు, ట్రాన్స్‌పోర్టు లారీల డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలి. ప్రమాదాల నివారణకు సహకరించాలని తరచూ ఆయా శాఖల అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ కొందరు డ్రైవర్లు కనీస నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులుగా మారుతున్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్ల గుండా కంకర, డస్ట్(రాయిపొడి)ను తరలిస్తున్న భారీ టిప్పర్ల (లారీలు) కారణంగా వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమర్థ్యానికి మించి తరలింపు..

మండలంలోని ఇన్ముల్‌నర్వ, సిద్ధాపూర్ గ్రామాల శివార్లలో స్టోన్ క్రషర్లు కొనసాగుతున్నాయి. నిత్యం వ్యాపారులు తమకు వచ్చే ఆర్డర్లను ఇన్ముల్‌నర్వ–కొత్తూరు, ఇన్ముల్‌నర్వ–షాద్‌నగర్ రోడ్ల మీదుగా జాతీయ రహదారుల గుండా గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. డ్రైవర్లు వాటి యజమానుల ఆదేశాల మేరకు టిప్పర్లలో సామర్థ్యానికి మించి కంకర, డస్ట్‌ను తరలిస్తున్నారు. ఈ సమయంలో లారీల్లో నుంచి కంకర, డస్ట్ రోడ్డుపై కింద పడకుండా టార్పాలిన్లు చుట్టడం లేదు. కొందరు డ్రైవర్లు టిప్పర్లకు టార్పాలిన్లు కడుతున్నప్పటికీ లోడ్ అధికంగా ఉండడంతో స్పీడ్ బ్రేకర్ల వద్ద కంకర రాళ్లు కిందపడుతున్నాయి. ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్డు వెడల్పుగా ఉండడంతో టిప్పర్ల డ్రైవర్లు వేగంగా వాహనాలను నడిపే క్రమంలో కంకర రాళ్లు వెనకాల వచ్చే వాహనాలకు తగిలి అద్దాలు పగిలిన సందర్భాలు సైతం ఉన్నాయి. దీనికి తోడు టార్పాలిన్ కట్టకపోవడంతో గాలికి డస్ట్(రాయిపొడి) ఎగిరి ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

కానరాని అధికారుల తనిఖీలు..

ఇన్ముల్‌నర్వ–కొత్తూరు, షాద్‌నగర్ రోడ్ల గుండా నిత్యం స్టోన్ క్రషర్లకు సంబంధించిన భారీ వాహనాలు పదుల సంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుంటాయి. కొన్ని వాహనాల్లో సామర్థ్యానికి మించి వస్తువులు, కంకరను తరలిస్తున్నారు. మరికొన్ని వాహనాలు కంకర, డస్ట్ కింద పడకుండా టార్పాలిన్లు కట్టడం లేదు. వీటి కారణంగా రోడ్లపై పడుతున్న కంకర, డస్ట్‌తో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు సైతం గురవుతున్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా సామర్థ్యానికి మించి కంకర, డస్ట్‌ను తరలిస్తున్న భారీ టిప్పర్లపై సంబంధిత శాఖల అధికారులు కనీస తనిఖీలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.